కామేశ్వరి

చోడవరపు రామశేషయ్యగారు

[మేము, మాగృహలక్ష్మి పాఠకులకు కథలు కబుర్లు చెప్పి శ్రమ కలిగించవలయునని గాని, లేక విద్యార్థుల మగు మా యమూల్య సమయమును వ్యయపఱచు కొన వలయునని గాని యించుకంతైనను యభిప్రాయము లేదు. కాని, కరుణాపూరితమును, హృదయ విదారకమగు నొక దృశ్యమును మేము స్వయముగ గాంచియుండుట వలన నది తమ సాన్నిధ్యమున యుంచవలయునను యుత్కంఠయే మమ్ముల నీ కార్యమునకు పురికొల్పినది.]

నేను చాల శ్రద్ధగా చదువవలయునని రాత్రి మూడుఘంటలకే యలారము పెట్టియుంటిని. ఉక్త సమయమున ఘడియారము తనపని తాను చేయ మొదలు పెట్టెను. దాని క్రూరకృత్యముచే మాగది వారలందరి నిద్రయు, భంగమయ్యెను. కాని, శీతల వాయు తీక్ష్ణకరజాలములచే యొకరికి లేచుట కిచ్ఛ కలిగియుండలేదు. నేనుమాత్రము నాడు దురదృష్టము నకు వగచుచు లేచి కూర్చుండి చదువ మొదలిడితిని. నిష్పక్షపాతియగు చలిదేవుని కొకరు యొక్కువయు, ఒకరు తక్కువయు లేదను విషయము స్వానుభవము వలన నాకు తెలిసెను. నేను కూడ బాగుగా ముసుగు పెట్టుకొని పరుండి పఠింప నారంభించితిని. నేను నా తలంపులో బాగుగా చదువుచునేయుంటిని. చదివిన విషయముపై విస్తృతమైన విమర్శన గావించుచునే యుంటిని. కాని నామిత్రుని వ్యాకులస్వనము విని యులిక్కిపడి లేచునంతవరకు నిద్రించుచున్నాననే జ్ఞానము లేకపోయెను.

కన్నడ ప్రాంతవాసియగు నొకమిత్రుడు వ్యగ్ర హృదయుడై కంపించుచు నాయెదుట నిలబడి యుండెను. వారిచెంత దండధారియగు నొక స్వామి వారు కాన్పించిరి. వారిద్దరి నాసమయమున నాదశ లో చూచి చకితుడనైతిని. వారిని గౌరవించవలయునను విషయమే మఱచిపోతిని. కింకర్తవ్యవిమూఢుడనై వారిపైపు తదేకదృష్టిగ చూడ నారంభించితిని. ఇంతలో నామిత్రుడు ఒక యభాగినియగు నాంధ్ర స్త్రీని రక్షించుటకు సిద్ధముగమ్మని హెచ్చరించెను. చేతనాశూన్యుడనగు నాకు వారి కరుణాపూరితమగు శబ్దము వినబడుటతోడనే శరీరమున రక్తనాళములం దుష్ణరక్తము త్వరితగతిని ప్రవహింప నారంభించెను. కాని శాంతచిత్తుడనై విషయమేమిటని యడిగితిని.

అంతట స్వామివారు తాను గతరాత్రి తెలిసి కొనిన విషయము నిట్లు చెప్పనారంభించెను. "నా మిత్రుడగు నొక మలబారుప్రాంతము వారిచ్చట నొక పండాయొద్ద పనిచేయుచున్నాడు. ఆయన గతరాత్రి తన యజమానుని యింటియందు దకస్మాత్తుగ మరణించిన యొక యాంధ్రుని గాంచెను. శవము యొక్క వివర్ణవదనమునుబట్టి విషప్రయోగము గావింపబడియుండునని నిశ్చయించి దానివలన విషయ మంతయు తెలిసికొనెను. మరణించినయువకుని పత్ని కూడ వచ్చియున్నదనియు, వారు ధనవంతులనియు ఆమెయొద్ద విలువగల నగలు గలవనియు, ఆమె సుందరియనియుగూడ చెప్పెను. శవదహనము రాత్రి పండ్రెండుఘంటలకు జరిగిపోయినట్లు తెలిసెను."

ఈ విచారపూరితమును, అమానుషకృత్యమును వినిన నాగదియందలి మిత్రులందరొక్కపర్యాయముగ యుగ్రులై పోయిరి. ఆపండా నిప్పుడే తుదముట్టించెదమని వెలువడ నుద్యుక్తులైరి. కాని వారినందఱిని శాంతిపఱచి యొక కన్నడిమిత్రుని ఒకమలబారు

291

మిత్రుని వెంటతీసికొని స్వామివారివెంట పయనమైతిమి. ఈదుఃఖవార్త నామనస్సును పరిపరివిధముల పీడింప నారంభించెను. ప్రతివానిపాదములా యభాగిని రక్షణార్థమై పరువిడుచుండెను. అందరి హృదయములు దడదడకొట్టుకొనుచుండెను; అందరి నాసికాపుటములనుండి వేడినిట్టూర్పులు వెలువడుచుండెను. మేము సాధారణముగా నడచుచుంటిమనియే భావించుచుంటిమి గాని మార్గస్థులు మాయీ యాతురతతో పరుగెత్తుచుండుటగాంచి నివ్వెరపోవుచుండిరి.

౨

మాపాఠకులకు కాశీనగరపు గొందులపరిచయము గావించిన తరువాత మేము మానిర్దిష్టస్థానమున ప్రవేశించెదము. ప్రాచీనకాలమునుండియు పిలువబడుచున్న కాశీపట్టణమున తమకు అన్నియు సందులే గాని యొకవిశాలమగు మార్గమైనదొరకదు. ప్రతి సందును, సామాన్యమగు యిద్దరిమనుజులకు మాత్రమాతిథ్యమిచ్చునంత విశాలము కలిగియుండును. దుర్గంధపూరితమగు—కాదు—సకలపాప పరివేష్టితములగు నాసందులలో భయంకరపాపభయముచే గాబోలును లోకరక్షకుడగు నాదిత్యుడుకూడ తన ప్రచండకిరణజాలముల ధారపాటునకైనను ప్రసరింపనిచ్చుటలేదు. కాని మనకొకపర్యాయము యీపవిత్రమార్గముగుండ ప్రయాణము చేయకతప్పదు. జాగ్రత్త; సావధానులరై ముందున కడుగిడుడు. క్రిందచూచిన చిన్నప్పుడు త్రాగిన దొంగాకుపసరుకూడ బయట యుడగవలసినదే!! పైకిచూచినచో పరమపావనియగు వైతరణీనది స్నానము తప్పదు. ఈసందులయుత్పత్తికి చాల కారణములు తెలుపబడుచుండును.

ఇప్పుడిట్టి సందుగుండ మేము పోవలసియున్నది. ఒకపర్యాయము కడు పార వాయుసేవనముచేసి జేబురుమాళ్ళతో ముక్కులు గట్టిగమూసుకొని, భగవంతునిపై భారమునైచి ముందునకు సాగితిమి. మేము చేరవలసినగృహము—కాదు కాదు—భూతగృహమొక సందుచివరయుండెను. ఇచ్చట భూతగృహనిర్మాణమునకు కారణము మహమ్మదీయుల యాత్రిమణమనియే చెప్పుదురు. ముసల్మానులు ముట్టడించినపుడు యీగృహములందు హిందువులు తమ యాత్మరక్షణ చేసికొనుచుండెడివారట. ఇవి ముఖ్యముగ స్త్రీలకై యేర్పాటు గావింపబడినవట.

ఉద్రేకపూరితులమై యింతవరకు వచ్చితిమేగాని ముందు చేయవలసిన కార్యమేమియో యొక్కరును నాలోచించియుండలేదు. స్వామివారు స్థానమునకు చిరపరిచితులగుటచే మేము చేరవలసియున్న గృహమునుగుర్తించి దానికి కొలదిదూరముగనే మమ్ములనందరిని నిలబడుట కాజ్ఞయొసంగిరి; మరియు ముందు చేయవలసిన విషయమేమని ప్రశ్నించిరి. అప్పుడు మా తెలివితక్కువకు మిగుల పశ్చాత్తాపపడి వారినే సలహా యీయవలసినదిగ కోరితిమి. తుదకు మేమందఱము దీర్ఘముగ నాలోచించి యొక పథకమును పన్నితిమి.

నేను నామిత్రులనందఱినివిడచి నలువైపుల పరికించుచు ముందునకు సాగితిని. నెమ్మదిగ సందా యింటిముందునకు చేరితిని. తలుపులు మూయబడియుండుటజూచి సంతసించితిని. మరల నలువైపుల చూచి తలుపుదొద్దకుచేరి రంధ్రములగుండ లోపల చూచితిని. అంతయు నంధకారమయము. చెవియొగ్గి వింటిని; ఎచ్చటనుండియో స్త్రీరోదనధ్వని వినవచ్చుచుండెను. ఆధ్వని నాకర్ణకుహరముల ప్రతిధ్వనించుటతోడనే శరీరమంతటను ఉష్ణరక్తము వెల్లివిరసి ప్రవహింప నారంభించెను. ఇంక నేమియు నాలోచింప నవసరము లేకపోయెను. తలుపులు గట్టిగ గ్రుద్దుచు కేకలు వేయ నారంభించితిని.

ఎట్టకేలకు తలుపులు తెరువబడినవి. కాని యిప్పుడుకూడ నిరాశయే నాలుగువైపుల నృత్యమాడుచుండెను. కొంతసేపటికి యొక [illegible] తలుపు

ప్రక్కనుండి యెదుట ప్రత్యక్షమయ్యెను. మేమిద్దఱము ఒకరినొకరు బాగుగ ఆపాదమస్తకము పరీక్షించుకొంటిమి. ఆమె భావములన్నియు తెలిసికొంటిమి. నాభావములన్నియు మఱుగుపరచి పండా వారెక్కడయని యడిగితిని. ఆమె నాప్రశ్నకు ప్రత్యుత్తరమీయకుండగనే నాపుట్టుపూర్వోత్తరముల నడుగ మొదలిడెను. నేనామె యడిగిన ప్రతిప్రశ్నకు లేశమైన ననుమానము లేకుండగ ప్రత్యుత్తరమిచ్చితిని. అప్పుడామె పండాగారిని పంపుదుమని లోనికిబోయెను.

ఆమె లోపలికి వెళ్ళుటతోడనే నేను రోదన ధ్వని ఏదిక్కునుండి వచ్చుచున్నదాయని చూడ నారంభించితిని. కాని మనుష్యుని యడుగుల చప్పుడు వినబడుటచే యేమియు తెలియగనివానివలె నాస్థానమున నేను నిలబడితిని. ఇంతలో పండాయచ్చటకు వచ్చిచేరెను. వానిని గాంచుటతోడనే ఫిలిమ్‌లోని రాక్షసాకృతి జ్ఞప్తికివచ్చెను. వచ్చుటతోడనే యెవరు నీవని తీవ్రముగ ప్రశ్నించెను.

నేను:—అయ్యా! మాదాంధ్రప్రాంతము. ఇచ్చట యూనివర్సిటీలో చదువుకొనుచున్నాను (యూనివర్సిటీ పేరుచెప్పితే పండాలందఱకు చాలభయము) మాబంధువుడగు రాజేశ్వరరావుగారిచ్చటకు యాత్రకై వచ్చియున్నారని తెలిసినది. వారికై రెండుదినములనుండి వెదకుచున్నాను. నేడు వారిచ్చట యున్నారని తెలిసి వచ్చితిని.

పండా:—అయ్యో! అట్లాగా! ఆయనగారు మీబంధువేనా? పాపము; విషజ్వరమువచ్చి నిన్ననే చనిపోయినారు.

నేను:—అయ్యో! అయ్యో! చనిపోయినారా? ఎంతఅదృష్టవంతులు? ఇట్టి పుణ్యక్షేత్రములోను అందులో తమవంటి సుహృదయులగు వారియాశ్రయమునను మరణించుటెంత గొప్పయదృష్టము? వారెంత మహాపుణ్యము చేయబట్టియోగదా యిట్టిమరణము సంభవించినది.

పండా:—కాశీలో యెంతపాపముచేసినను, చనిపోవుసమయమున స్వర్గప్రాప్తియేగాని నరకము పేరు వినవలసిన యవసరము లేనేలేదు.

నేను:—(అది విననట్లుగా) రాజేశ్వరరావుగారి భార్యమా పినతల్లిగారి కుమార్తె. పాపమామెకు చిన్నతనమునందే యింతకష్టమనుభవింపవలసి వచ్చినదిగదా? దయచేసి ఆమె యెచ్చటయున్నదో చూపింపుడు. ఆమెకు నావిచారమును ప్రకటించి కొంచెమోదార్చెదను.

పండా:—(ఉలిక్కిపడి వికృతస్వరముతో) అబ్బే! ఆమె యిచ్చటలేదు. నిన్ననే వారిదేశము వెళ్ళిపోయినది.

ఇది వినుటతోడనే పిడుగు పడినట్లైనది. వేరొక మార్గమేమియు స్ఫురించుటలేదు. మనస్సైపులమాదిరిగా స్వతంత్రించి యేమగవాడు లోపలకు వెళ్ళజాలడు. ఇచ్చట ఘోషాపద్ధతి చాల కఠినముగాయుండును. కాని యింతలో మొదట నాకు వినిపించిన యాక్రందనమే యీపర్యాయము ద్విగుణీకృతముగ వినిపించెను. నేనదివిని, ఆయేడ్పువారెవరని యడిగితిని.

పండా:—ఆమె మాయింటావిడ. ఇప్పుడే మాయిద్దఱికి పోట్లాటజరిగినది. నేనామెను కొట్టితిని. అందులకై యేడ్చుచున్నది.

నేను:—కొంచెమునే పూరకుండి కాదు: తాము, నన్ను పరిహాసము చేయుచున్నారు. ఆస్వరము మా సోదరిదే! నేనిదివఱకు చాలపర్యాయములు వినియుంటిని.

నాయీమాట వినుటతోడనే పండా ముఖాకృతి వికృతినొందెను. ముఖమున యిదివఱకుగల కొంచెము కళయుగూడ యంతర్ధానమయ్యెను. వానికేమియు చెప్పుటకు తోచలేదు. చివరకు కోపముతో 'నీవు పొరపాటుపడుచున్నా' వని చెప్పి లోనికిబోవనుద్యుక్తుడయ్యెను. ఇది గాంచి క్రోధభయశోకావమానము

293

లచే నాకంత మవరుద్ధమయ్యెను. శరీరమంతయు కంపింప నారంభించెను. ఇంతలో కృపానుయుడగు సర్వేశ్వరునికృపచే నామిత్రులు వచ్చిచేరిరి. వారు నన్నెరుగనట్లుగనే నటించుచు, పండాతో యితర సంభాషణ మారంభించిరి. ఇటు జరుగుచున్న సంభాషణము విని కాబోలు లోపలనుండి 'రక్షింపుడు; రక్షింపుడు;' అను భయార్తనాదము వినవచ్చెను. అదివినుట తోడనే నాయొడలావేశముచే యుప్పొంగిపోయెను. వెనుకముందు చూడక యొక్కసారిగ యచ్చటకుఁ బరువిడితిని. అచ్చట దృశ్యముగాంచి చకితుడనైతిని. సీతాశోకవాసము తలంపునకువచ్చెను. అది వినుటయే గాని ఇది ప్రత్యక్షముగ గాంచితిని. ఆమెకంటికి మంటికి నేకధారగా నేడ్చుచుండెను. ఆదుఃఖసాగర ప్రవాహమున వచ్చుటయున్న శిలాప్రతిమలు (లింగములు) గూడ కొట్టుకొనిపోవునా యనునట్లులదోచెను. దుఃఖావేశముచే నాకు బాహ్యజ్ఞానము లేకపోయెను. కాని నాకు తెలియకుండగనే సోదరి! భయపడకుము, నీసోదరు డిచ్చటనే యున్నాడనుమాటలు నానోటి నుండి వెలువడెను. ఈమాట లచ్చటయున్న స్త్రీలకు తెలియలేదు. వారు నావంక తమ నిశిత కటాక్షములఁ బఱుప నారంభించిరి. ఆ దుఃఖిత యొకమాఱు నావైపుచూచి మరల యినుమడించిన స్వరముతో యేడువ నారంభించెను. నేనిట్టివిపత్తులలో చిక్కుకొనుట కిదియే ప్రథమపర్యాయము. సందర్భానుసారముగ యోదార్చుట నాకించుకంతైనను తెలియదు. ఆమె యాక్రందనము నన్ను మరింత యస్థిరునిగ గావించివైచెను.

భయంకరమును, కరుణాపూరితమును, హృదయభేదకమునగు నామె శోకారవమును విని నామిత్రులు కూడ పరుగిడివచ్చిరి. వారివెంట పండాకూడ వచ్చి నాడని చెప్ప నవసరముండదు. వీరందఱు వచ్చుట తోడనే దాసీతప్ప యటనున్న మిగిలిన స్త్రీలందఱు లోనికిపోయిరి. నామిత్రులుకూడ శోకరుణాదృశ్యముగాంచి నిశ్చేష్టులైరి. వారందఱు భిన్నభావలవారగుటచే నామె నోదార్పజాలకపోయిరి. కాని నాకన్నడిమిత్రుడు తెలుగునందు తనకుగల స్వల్ప జ్ఞానముతో నామె నోదార్పనెంచెను. ఆయన యోదార్పుమాటలను వినుటచే నాదుఃఖసమయమున నాకు నవ్వు వచ్చుటయేగాక, యేడ్చుచున్నఆమె గూడ కొంతదనుక తనదుఃఖమును మఱచిపోయెను. ఈయవకాశమును పొంది నేనామెవిపత్తును తెలిసికొన ప్రయత్నించితిని. నామాటలను విని మరల యామె తన దుఃఖసముద్రములో మునిఁగిపోయెను.

పండామహాశయుడు మా యీప్రవర్తనమునకు మనస్సులో చాల కోపించుకొనుచుండెను. కాని మాతో యేమియు చెప్పజాలకుండెను. మమ్ముల నొక పర్యాయము తీవ్రముగఁజూచి బయటకువెళ్ళెను. ఆ చూపునందు,కృత్రిమము, యీర్ష్య, ప్రతీకారము మిళితమైయుండెను. ఆయన వెళ్లినపుడు తలుపుబయట బంధించినశబ్దము మాయందఱకు వినవచ్చెను. ఇప్పుడు మే మాగదిలో బంధితులమైపోతిమి. బయటకుచేరు మార్గమేమియు కాన్పించుటలేదు. దాసీ తనశక్తి కొలది, యేడ్చుచున్న యామెనోదార్ప ప్రయత్నించుచుండెను. మేమందఱము వెంటనే యామె హృదయమును గనిపెట్టితిమి. నా కించుక ధైర్యముకలిగినది. వెంటనే జేబునుండి పదిరూపాయలనోటునుదీసి యామె చేతియందిడి తల్లీ! నీవు మమ్ములనందఱ నీయాపద నుండి రక్షింపుమని కోరితిని. ఆమె మొదట చాల సందేహించెను. మాయందఱి ప్రార్థనవినుటచే నామె హృదయ మించుక ద్రవీభూతమయ్యెను. కొంచెము దనుక యాలోచించి నలువైపులజూచి యానోటును గుప్తపఱచెను. నేను కామేశ్వరికి ధైర్యముచెప్పి రానున్న యాపదనుండి తప్పించుకొనుటకుగాను మా వెంటరావలయునని ప్రార్థించితిని. సుగుణవతియగు నామె వెంటనే యంగీకరించెను. ఆ దాది మమ్ముల నందఱి నొక గుప్తమార్గముగుండ బయటకుచేర్చెను. నా మలబారుమిత్రుడు సాధ్యమైనంతవఱకు కామే

శ్వరి సామాను, పెట్టెను తీసికొని వెనుకనుంచి మనుష్యుల గలసికొనెను. కామేశ్వరి నగలింతవరకు చెక్కుచెదర లేకయుండెను. మే మెంచ్చిన మార్గము, గంగానది యొడ్డునగల కేదారుఘట్టమునకు చేరెను. మాకందఱకు పూర్తిగ ధైర్యము వచ్చెను. కాని పండా వెంటాడు నేమోయను భయముచే యచ్చటనుండి వెంటనే పయనమై, హనుమాను ఘట్టమునందుగల స్వామివారి యాశ్రమమున ప్రవేశించితిమి.

౪

రాజేశ్వరరావు తెనాలి తాలూకా మాచర్ల గ్రామ కాపురస్థుడగు ధనవంతుడు. ఆయనకు ముప్పది యెకరముల సుక్షేత్రమగు మాగాణిభూమియు, కొబ్బరి, పనస, అరటి తోటలును గలవు. వానిపై సాలీనా మూడు వేల రూప్యము లాభాయము వచ్చును. ఆయన తల్లి తండ్రుల కేకమాత్ర పుత్రుడు. చిన్నతనము నుండియు మిగుల గారాబముగ పెంచబడెను. పాపము రాజేశ్వరరావు చిన్నతనమునందే, మాతాపితలను గోలుపోయెను. రాజేశ్వరరావు, సుందరుడును, ఉత్సాహవంతుడును, బుద్ధిమంతుడును, తెలివిగల వాడును యగు యువకుడు. కాని యేకారణము చేతనో తగినంత విద్యాజ్ఞానము లేదు. అందువలన ప్రపంచ జ్ఞానశూన్యుడని వేరుగ చెప్ప నవసరముండదు. మనరాజేశ్వరరావు విచ్చలవిడిగ ఖర్చుచేయుచు జీవిత సుఖలాభమును పొందుచుండెడివాడు. కాని పతిసేవాపరాయణి యగు కామేశ్వరి కాపురమునకు వచ్చిన తరువాత ఖర్చు యించుకంత తగ్గెను.

కామేశ్వరి సుందరియు, సుశీలయు, సుగుణవతియు, పతిభక్తిపరాయణియునై యున్నది. ఆమె యెప్పుడునూ, పతిసేవ చేయుటయం దించుకంతయును లోపము కలుగనిచ్చెడిది కాదు. ఇట్టి సుగుణ ఖనియగు పత్నిని గాంచి రాజేశ్వరరావు అత్యంత ముదమునందు చుండెడివాడు; మరియు తాను ధన్యుడనని తలంచు చుండెడివాడు.

రాజేశ్వరరావును సదా తన జన్మదాతలగు తల్లి దండ్రుల ఋణమెట్లు తీర్చగలనాయను చింతయే బాధించుచుండెడిది. పెద్దల యుపదేశముల వలన కాశీ, గయా, ప్రయాగాది పుణ్యక్షేత్రములలో పితృతర్పణ మర్పించిన తన పూర్వజుల యాత్మకు శాంతి కలుగుననియు, వారికి స్వర్గప్రాప్తి కలుగుననియు తెలిసికొనెను. అదివిని యప్పటినుండియు యాత్రకు బయలు దేరవలయునను యుత్కంఠ వానిని బాధించుచుండెను. తుదకొక శుభముహూర్తమున, పతివ్రతయగు పత్నిని వెంట దీసుకొని, పరమపావనియగు వారణాసికి ప్రయాణమయ్యెను. ధనికుడగు రాజేశ్వరరావు యాత్రకు బయలుదేరెనన్న యింకేమి తక్కువ యుండును. కావలసినంత సామాను, ధనము తీసుకొని బయలు దేరెను. ఉక్తసమయమున కాశీస్టేషన్ వచ్చిచేరెను.

స్టేషన్‌లో దిగుటతడవుగనే పండాలందఱు రాజేశ్వర రావును ముట్టడించిరి. ప్రతిపండాయును వివిధములగు సదుపాయములను చేయుదుమని తమతమ మామూలు పాటలను ప్రారంభించిరి. పాపము రాజేశ్వరరావుకు వారిగోల యేమియు తెలియలేదు. తమాషా చూస్తూ యట్లే నిలబడిపోయెను. పండాలకు ప్రయాణికుల స్థితిగతులను కనిపెట్టుటలో యెక్కువ శ్రమయుండదు. వారు వెంటనే మనరావుగారి దశను తెలిసికొనిరి. వారిలో మన పండాగారికి రెండు తెనుగు మాటలు వచ్చును. "మా వెంటరండి, మీకు బాగా చేస్తాను." ఈ బాగాచేస్తాననే దాని కర్థమేమిటో రాజేశ్వరునకేమి తెలియును. అంధకారములో దీపపు వెలుతురు కాన్పించినట్లు, హిందీభాషా ప్రపంచములో తెలుగు మాట్లాడువాడు దొఱకేటప్పటికి చాలసంతోషము కలిగెను. వెంటనే మారుమాట చెప్పకుండ "టాంగా"లో యెక్కి పండాగారి గృహమునకు చేరెను.

మొదటిదినమున గంగాస్నానము, విశ్వేశ్వరుని దర్శనము పూర్తియయ్యెను. రెండవదినమున పితృతర్ప

ణము కొంతకైనవి జరుగవలసియున్నది. కాని పాపమా సాయంకాలమే రాజేశ్వరరావునకు తీవ్రముగు జ్వరము వచ్చెను. పండా మొట్టమొదటనే తన చాతుర్యము చేసెను, ఉపచారములు చేసెను, రాజేశ్వరరావు కృపకు పాత్రుడయ్యెను. ఇప్పుడు రాజేశ్వరరావు పండాగారి చేతిలో కీలుబొమ్మ. జ్వరము వచ్చుటతోడనే పండా తన యాదార్థ్యమంతయు ప్రకటించుచు మందుతీసికొనివచ్చి యిచ్చి, దీనితో రేపటికి పూర్తిగ పోవునని చెప్పెను. ఏమిటి? అని యడుగువారెవరూ లేరుగదా? ఇతరసహాయము లేక పోవుటచేతను, పండా యందుగల విశ్వాసముచేతను ఆతనిచ్చిన మందు త్రాగెను.

జ్వరము తగ్గుటకు మారుగ హెచ్చిపోవుచుండెను. అదిగాంచి కామేశ్వరికి, యాతురత యెక్కువయ్యెను. కాని, అబలయగు నామె యేమిచేయగలదు? భగవంతునిపై భారమువైచి రోగియగు పతికి సేవచేయుచుండెను. మఱుచటి యుదయమునకు రాజేశ్వరరావు ముఖము వివర్ణమై పోయెను. అదిగాంచి కామేశ్వరి కనుమానము కలిగెను. ఆమె సంజ్ఞాపూర్వకముగ డాక్టరుని బిలువుమని వినయపూర్వకముగ పండాను ప్రార్థించెను. దుర్మార్గుడగు నా పండా కీమె దీనాలాపములు, యేమి రుచించును? తీసికొనివచ్చెదనని చెప్పి వెడలెను కాని సాయంకాల మైదుఘంటలవరకు తిరిగి రాలేదు. కామేశ్వరి దుఃఖమునకు మేరలేకుండెను. ఇంటిలోని స్త్రీలెవరును నామె నోదార్చుటకు వచ్చియుండలేదు. పాపము దాసీమాత్రము మూగభాషతో కామేశ్వరి కంతచరిత్రయు తెలియజెప్పెను. కామేశ్వరది వినుటతోడనే మూర్ఛితయయ్యెను. మూర్ఛనుండి లేచి చూచుసరికి పతి స్వర్గస్థుడై యుండెను.

విదేశములలో దుర్మార్గుడగు పాషండుడును, ధనపిశాచియునగు పండావలన పతి మరణము సంభవించినప్పు డబలయగు కామేశ్వరి యేమి చేయగలదు? ఆమె హృదయము దుఃఖావేగముచే భిన్నభిన్నములయ్యెను. ఆమె స్పృహ లేకుండగ పతి శవముపై పడిపోయెను.

మరుచటిదినము స్పృహవచ్చునప్పటికి, కామేశ్వరి, తానొక చీకటిగదిలో యుంటినని తెలిసికొనెను. నలువైపుల గాంచెను. ద్వారములన్నియు మూయబడి యుండెను. తన కిట్టి కష్టము కలిగినదాయని యాలోచింప మొదలిడెను. క్రమక్రమముగ గతదినమందలి భయంకర దృశ్యమంతయు తలంపునకు వచ్చెను. స్ఫురణకు వచ్చుటతోడనే యేడువ నారంభించెను. ఈ యేడుపు విని యింటిలోని స్త్రీ లచ్చటికి వచ్చి చేరిరి కాని యెవరును కామేశ్వరి శోకించుచున్నను ధైర్యము చెప్పువారు లేకపోయిరి. ఈ రోదనధ్వనియే మొదట నాకు వినిపించినది.

నే మిచ్చిన తంతివార్తవలన, కామేశ్వరి సోదరుడు మూడవదినమున కాశీవచ్చి చేరెను. నా మిత్రులు స్టేషనుకువెళ్లి వారిని తీసుకొనివచ్చిరి. ఈ మూడుదినములలోను కామేశ్వరి పవిత్ర చరిత్ర నంతయు గాంచి యానందాంబుధి నోలలాడితిమి. ఆమె పతిభక్తి కచ్చెరువొందితిమి.

స్వామివారికి మూడుదినములలో, కేసుచేయుటకైన మార్గము దొఱకదేమో యని రహస్యముగ ప్రయత్నించిరి. ఆయన ప్రయత్నము పండాలకు దెలిసిన, గంగాప్రీతము కావలసినదే. పండాలతో జగడమాడి కాశిలో నెవరు నివసించగలరు? అందుచే చాల జాగ్రత్తగ ప్రయత్నము చేయవలసి వచ్చెను స్వామివారికి. మేముకూడ స్వామివారి మలబారు మిత్రుని చాల నిర్బంధించితిమి. ధనాశ జూపించితిమి. కాని నిరర్థకమయ్యెను. ఎంతచెప్పినను, ఆయన వినలేదు. ప్రాణములందాస యెవరికి యుండదు! అంతే ఆత్మత్యాగులు లేరని నా యభిప్రాయము కాదు. తుదకు మాకేమియు వేరొక మార్గము గాన్పించనందున, కామేశ్వరిని ఆమె సోదరునితో వారి గ్రామమునకు పంపివైచితిమి.